క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

నగరి : మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 త్రో బాల్ పోటీల్లో బాలుర విభాగంలో వి.రాకేష్ (9వ తరగతి), బాలికల విభాగంలో ఎస్ఎస్.బృంద (9వ తరగతి), సి.సుకన్య (7వ తరగతి) ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు(జిల్లా జట్టుకు) ఎంపికయ్యారు. అలాగే విద్యార్థి ఇ.సోము (10వ తరగతి) పెద్ద పంజాణి మండలం, నిడిగుంట జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బుధవారం పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్ఎం ఏ.వెంకటేశ్వర్లు, పీడీలు మణి, కార్తికేయన్, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ పింఛన్లు



పింఛన్లు పంపిణీ చేస్తున్న మురళీరెడ్డి

పెనుమూరు(కార్వేటినగరం) : అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఉగ్రాణంపల్లె సర్పంచ్ మురళీరెడ్డి అన్నారు. బుధవారం ఎంపీటీసీ సభ్యురాలు జమునతో కలసి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా పథకాలు అందించేందుకే ప్రతిష్టాత్మకంగా వలంటీర్ వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని అన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులకు గుర్తింపు



పోటీల్లో ప్రతిభ చూపిన చాత్రోపాధ్యాయులతో అధ్యాపకులు

కార్వేటినగరం: గురువులకు సమాజంలో ప్రత్యేక స్థానం ఉంటుందని జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్) ఇన్‌చార్జి ప్రిన్సిపల్ చెంగల్‌రాజు అన్నారు. బుధవారం డైట్‌లో ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైందని, సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని తెలిపారు. చాత్రోపాధ్యాయుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు పోటీల్లో ప్రతిభ చూపిన ఛాత్రోపాధ్యాలకు మెమొంటోలను అందించారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ బాలన్

నగరి : బాలింతలు, గర్భిణులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్ అన్నారు. బుధవారం సత్రవాడ దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరునెలలు నిండిన పిల్లల తల్లులకు ప్రభుత్వం ద్వారా అందించే పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టిహారంతో రోగనిరోధక శక్తి లభిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అందుబాటులో వైద్యం

వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల పేదలకు నాణ్యమైన వైద్యసేవలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎంపీడీఓ సుధాకర రావు అన్నారు. బుధవారం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో పూర్తి అయిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. అంతకు ముందు గ్రామ సచివాలయంలో నిర్వహించిన సమావేశంలో పథకాల లబ్ధిదారుల ఎంపికపై సూచనలు సలహాలు అందజేశారు. సమస్యల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీడీఓ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టె సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు పేట ధనుంజయరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నాడు పడిగాపులు.. నేడు ఇంటి వద్దకే..!



జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న డిప్యూటీ సీఎం, మహిళలు



పెరిగిన పింఛన్‌ను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు
- పింఛన్ల పంపిణీలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం కార్యాలయాల వద్ద లబ్ధిదారులు పడిగాపులు కాసేవారని, ప్రస్తుతం జగనన్న ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన వలంటరీ వ్యవస్థతో గుమ్మం వద్దకే పింఛన్లు అందిస్తూ అవ్వాతాతలకు అండగా లుస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ లత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్య క్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. నారాయణస్వామి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమాల వైపు యావత్ భారతదేశం చూస్తుందని తెలిపారు. విద్యాభివృద్ధితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నాడు-నేడు కింద ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారని, అమ్మఒడి నుంచి విదేశీ విద్యాకానుక వరకు అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. ప్రజలకు జగనన్న ప్రభుత్వం పూలబాట వేస్తుందని, ప్రజలకు గతంలో నరకాన్ని చూపించిన ప్రభుత్వం చంద్రబాబుదని గుర్తు చేశారు. నిత్యం పదవి కోసమే పోరాటం చేస్తూ నమ్మిన ప్రజలను మోసం చేయడమే బాబు అజెండా అని ఆరోపించారు. బాబుకు ధైర్యం ఉంటే జగనన్న ప్రకటించిన సంక్షేమాలను రద్దు చేస్తానని ఎన్నికలకు సిద్ధం కావాలని సవాలు విసిరారు. జన్మభూమి కమిటీలను అడ్డుపెట్టుకుని ప్రజాధనాన్ని దోచుకోవడమే కాకుండా ఓట్ల కోసం పసుపు కుంకుమ పేరుతో మహిళలను దగా చేశారని, అలాంటి బాబుకు మహిళలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. కుల వృత్తులను ప్రోత్సహించిన బాబు, నేడు అధికారం కోసం బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని విమర్శించారు. మండలంలో 259మంది నూతన లబ్ధిదారులతో పాటు 7,169 మందికి రూ.కోటి 49 లక్షలను అందించినట్లు తెలిపారు.

మద్యం అక్రమ అమ్మకాలు నేరం

మద్యం అక్రమ అమ్మకాలు నేరమని ఏఈఎస్ మధు మోహన్‌రావు అన్నారు. కార్వేటినగరం పెద్ద దళితవాడలో మద్యం అక్రమాలు అమ్మకాలు చేస్తూ పరివర్తనలో భాగంగా మానుకున్న 83 కుటుంబాలకు రూ.41లక్షల 25 వేల చెక్కును మంత్రి ద్వారా అందించారు. అనంతరం జగనన్న చిత్రపటానికి లబ్ధిదారులు పాలాభిషేకం చేశారు. అలాగే మంత్రి చేతుల మీదుల పెంచిన నూతన పింఛన్లను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ తులసి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజవర్మ, యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో మోహన్ మురళి, తహసీల్దార్ అమర్నాథ్ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న ధ్యేయం



నింద్ర : పెరిగిన పింఛన్ అందుకున్న లబ్ధిదారులతో మంత్రి రోజా

నింద్ర: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పర్యాటక, క్రీడల శాఖ మంత్రి రోజా అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. లబ్ధిదారులకు పెంచిన పింఛన్లను పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూ అవ్వా, తాతా, దివ్యాంగులు, వితంతువులు, మహిళల కళ్లలో ఆనందం నింపడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని తెలిపారు. పేదల అభ్యున్నతి కోసం జగన్నన కృషి చేస్తుంటే, చంద్రబాబు బినామీల కోసం పోరాటం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ అందాలంటే జన్మభూమి కమిటీల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వచ్చేదని, అది కూడా ఆపార్టీ మద్దతుదారులకే అందేదని ఆరోపించారు. నేడు అర్హులందరికీ పింఛన్లు మంజూరు కావడంతోపాటు ఒకటో తేదీ తెల్లవారు జామునే వలంటీర్లు తలుపుతట్టి అందిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలో 4,740 మంది లబ్ధిదారులకు పింఛన్ల కోసం రూ.కోటి 25 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నూతనంగా 159 మందికి పింఛన్ మంజూరైనట్లు తెలిపారు. ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, తహశీల్దార్ అమరేంద్రబాబు, ఎంపీడీవో వేణు, ఉపాధి ఏపీడీ శోభన్‌బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్యామ్‌లాల్, మండల అధ్యక్షుడు వేణురాజు, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి మేరి, కోఆప్షన్ సభ్యుడు అనిల్, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు విజేష్, సర్పంచ్‌లు బాబురెడ్డి, గౌరి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు దామోదరం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం మండలంలో కొత్తగా 136 మంది అర్హులకు మంజూరైన పింఛన్లను మంత్రి ఆర్కే రోజా అందించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గతంలో పింఛన్ల కోసం కార్యాలయాల చుట్టూ అవ్వాతాతలు పడికాపులు కాసేవారని, నేడు వలంటీర్లు ఇంటికే వచ్చి అందిస్తున్నారని తెలిపారు. ఎంపీపీ జమున, వైస్ ఎంపీపీ బాలాజీ, దశరథరాజు, ఎంపీడీవో సతీష్, తహశీల్దార్ అమరేంద్రబాబు పాల్గొన్నారు.



విజయపురంలో పథకాలను వివరిస్తున్న మంత్రి ఆర్కే రోజా

దేశమ్మ దేవస్థానం క్యాలెండర్ ఆవిష్కరణ

నగరి : నేత్రదేవత శ్రీదేశమ్మ దేవస్థానం 2023 క్యాలెండర్‌ను మంత్రి ఆర్కేరోజా బుధవారం తన నివాస కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. క్యాలెండర్లను కమిటీ సభ్యులకు అందజేశారు. మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రామ్‌ప్రసాద్ రెడ్డి, దేవాలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈవో మునిశేఖర్, మున్సిపల్ చైర్మన్ పీజే నీలమేఘం, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

నగరి : అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని పర్యాటక, క్రీడలశాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. విజయపురం మండలంలోని గంగమాంబపురం దళితవాడ, గంగమాంబపుర గ్రా మాల్లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామస్తులకు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, తాము ఆనందంగా ఉన్నామని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ బాలాజీ, దశరథరాజు, మండల కన్వీనర్ గోపీనాథ్, సింగిల్ విండో అధ్యక్షుడు హరినాయుడు, ఆర్‌టీకే చైర్మన్ గుణశేఖర్, ఆనందన్, కో ఆప్షన్ మెంబర్ రాజేంద్రన్, రైతు సంఘం అధ్యక్షుడు రవినాయుడు, ఎంపీడీవో సతీష్, తహశీల్దార్ అమరేంద్రబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పేదలకు సేవ–భగవంతునికి సేవ



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పుత్తూరు రూరల్: పేదలకు సేవ భగవంతుని సేవతో సమానమని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పెన్షనర్స్ భవనంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం, గుడ్ షెపర్డ్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ మాట్లాడుతూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెన్షనర్స్ సంఘ సభ్యులు అభినందనీయులన్నారు. ప్రత్యేకించి వృద్ధుల ఆరోగ్యంపై దృష్టి సారించి వైద్య సేవలందించడం విశేషమన్నారు. శిబిరంలో కంటి, దంత, బీపీ, షుగర్, జనరల్ సమస్యలకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ శిబిరంలో 306 మంది వైద్య సేవలందుకున్నట్లు పెన్షనర్స్ సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు తెలిపారు. గుడ్ షెపర్డ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అమెరికన్ డాక్టర్లతో పాటు, స్థానిక డాక్టర్లు సేవలందించినట్లు వివరించారు. హాస్పిటల్ నిర్వాహకులు హెంద్రీభాస్కర్, ప్రవీణ్‌కుమార్, పెన్షనర్స్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రదోష కాల పూజలు



ప్రత్యేకాలంకరణలో నందీశ్వరుడు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలో అరుణగిరిపై వెలసి ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో బుధ వారం సాయంత్రం ప్రదోష కాల పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉద యం పాలాభిషేకం అనంతరం స్వామివారిని వెండి తొడుగులతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజలు పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

తల్లిపాలు బిడ్డలకు శ్రేష్టం



మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: తల్లిపాలు బిడ్డలకు శ్రేష్టమని తూగుండ్రం వైద్యాధికారి దివ్య తెలిపారు. మండలంలోని ఆవలకొండ గ్రామంలో బుధవారం తల్లిపాల విశిష్టత, వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లా డుతూ తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు చేసుకోవాలని కోరారు. ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ బిడ్డలకు ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించినట్లయితే 13 ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు.

శ్రీవారి భక్తుడి సైకిల్ యాత్ర

చంద్రగిరి: తిరుమల శ్రీవారి భక్తుడు శక్తిదాసన్ సైకిల్ యాత్ర పూర్తి చేసుకుని బుధవారం తిరుగు ప్రయాణమయ్యారు. తమిళనాడు, కోయంబత్తూరు జిల్లా కినత్తుకడవుంగరామ్ పాళ్యంకు చెందిన శక్తిదాసన్ (60) తిరుమల శ్రీవారి దర్శనార్థం సుమారు 400 కిలోమీటర్ల దూరం సైకిల్‌పై వచ్చారు. సోమవారం తిరుచానూరులోని శ్రీపద్మావతీ అమ్మవారిని దర్శించుకుని రాత్రి అక్కడే బస చేశారు. మంగళవారం వేకువజామున తిరుమలకు కాలినడకన వెళ్లి స్వామిని దర్శించుకుని రాత్రికి తిరుచానూరు చేరుకుని, బుధవారం ఉదయం ఆయన తిరుగు ప్రయాణమయ్యారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని మున్సిపల్ చైర్మన్ ఏ.హరి పంపిణీ చేశారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రులకు పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ క్రమం తప్పకుండా జరుగుతోంది. గర్భిణులకు, వారి సహాయకులకు విజిటబుల్‌పలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీ, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. డాక్టర్ శంకర్ నరేన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్స్ నారాయణస్వామి, పుష్పమ్మ, నాయకుడు జయబాబు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి సేవలు ఆదర్శనీయం

తిరుచానూరు: విద్యాభివృద్ధితో పాటు వర్సిటీ అభివృద్ధికి శ్రీకాంత్‌రెడ్డి అందించిన సేవలు ఆదర్శనీయమని పలువురు వ్యక్తులు కొనియాడారు. ఎస్వీయూ రెక్టార్‌గా పదవీ విరమణ పొందిన ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డికి బుధవారం శ్రీనివాస ఆడిరియంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ అధ్యక్షతన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వీసీ రాజారెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో ఎంతో కృషి చేశారని తెలిపారు. సిమ్స్ డైరెక్టర్ వెంగమ్మ, పద్మావతి వర్సిటీ వీసీ జమున, విక్రమ సింహపురి వర్సిటీ వీసీ సుందరవల్లి, కర్నూలు క్లస్టర్ వర్సిటీ వీసీ సాయి గోపాల్ మాట్లాడుతూ శ్రీకాంత్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని, ఆయన సేవలను కొనియాడారు.

అంధులకు మార్గదర్శకుడు బ్రెయిలీ



పుత్తూరు భవిత కేంద్రంలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయుడు సుందరం



నింద్ర: బహుమతుల పంపిణీ



పాలసముద్రం : బహుమతుల అందజేత

పుత్తూరు రూరల్: పుత్తూరు భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ తిరుమలరాజు మాట్లాడుతూ అంగ వైకల్యం ఉన్నా వివిధ రంగాల్లో రాణిస్తున్న వారు ఎందరో ఉన్నారని చెప్పారు. అలాంటి వారిని స్ఫూర్తి తీసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పుట్టుకతో అంధుడైన ఎస్.సుందరం ఉపాధ్యాయుడుగా అందిస్తున్న సేవలను కొనియాడారు. 2016లో ఉపాధ్యాయుడుగా బాధ్యతలు స్వీకరించిన సుందరం 2021 నుంచి స్థానిక భవానీనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సుందరంను ఘనంగా సన్మానించారు. భవిత ఉపాధ్యాయుడు పి.ఆనంద్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి నారాయణ మాట్లాడుతూ బ్రెయిలీ అంధుడిగానే ఉన్నత చదువులు చదివారని తెలిపారు. తాను పడిన కష్టం ఇతరులు పడకూదని అంధులు రాయడం, చదవడం కోసం ప్రత్యేక లిపిని రూపొందించారని పేర్కొన్నారు. నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణి చేశారు. సహిత ఉపాధ్యాయులు నాగరాజు, వేంకటేశులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలసముద్రం : స్థానిక భవిత కేంద్రంలో ఐఆర్‌టీ టీచర్లు బాలాజీ, వసంత ఆధ్వర్యంలో ప్రపంచ అంధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంధుల కోసం లూయిస్ బ్రెయిలీ ప్రత్యేక లిపిని కనుక్కొని మార్గదర్శకుడు అయ్యారని తెలిపారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఉపాధ్యాయురాలు జమున, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జల్లికట్టు నిషేధంపై ప్రచారం



వెదురుకుప్పం : జల్లికట్టు నిషేధంపై కరపత్రాల పంపిణీ

వెదురుకుప్పం: జల్లికట్టు నిషేధంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. బుధవారం మండలంలోని కాపుమొండివెంగనపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల్లికట్టుతో జరిగే పరిణామాలను వివరించారు. మైక్ ద్వారా ప్రజల్లో చైతన్యం తెస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జల్లికట్టు, జూదం, కోడె పందేలు నిషేధమని సూచించారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలను రెచ్చగొట్టవద్దు

పెనుమూరు(కార్వేటినగరం) : జల్లికట్టు పేరుతో టీడీపీ నాయకులు ప్రజలను రెచ్చగొడుతున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు(ఎంపీటీసీ సభ్యురాలు) యశోదారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రతిపక్ష నాయకులు జల్లికట్టును అడ్డుపెట్టుకుని అమాయక ప్రజలను రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నారని తెలిపారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, దూదిమోహన్, కృష్ణారెడ్డి మండల నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల రంగ ప్రవేశంతో ఆగిన జల్లికట్టు

మండలంలోని బొంతి వంక గ్రామంలో జల్లికట్టు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచార మేరకు పోలీసులు గ్రామానికి వెళ్లి అడ్డుకున్నారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

డీఆర్‌డీఓకు భూసేకరణ పూర్తి చేయాలి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

శ్రీరంగరాజపురం: డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ)కు భూ సేకరణ పూర్తి చేసి త్వరగా అప్పగించాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, ఇతర అధికారులతో కలసి తచ్చూరు-చిత్తూరు జాతీయ రహదారి పనులను పరిశీలించారు. ఈ జాతీయ రహదారి నుంచి డీఆర్‌డీఓకు, పుల్లూరు నుంచి మరో రహదారి ఏర్పాటుకు కావాల్సిన స్థలాన్ని వెంటనే సేకరించాలని ఆర్డీఓ రేణుకను కలెక్టర్ ఆదేశించారు. వీలైనంత త్వరగా భూ సేకరణ పూర్తి చేసి, అప్పగిస్తే వారు రోడ్లు పనులు చేయడానికి అనువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ ఎస్ఈ దయానందం, జాతీయ రహదారుల పీడీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పపై శ్రీకామాక్షి

అమ్మవారి కటాక్షం





పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) తెప్పపై కొలువైన శ్రీకామాక్షి అమ్మవారు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో చేపడుతున్న తెప్పోత్సవాల్లో నాలుగో రోజు బుధవారం సాయంత్రం శ్రీకామాక్షి అమ్మవారు తెప్పపై భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 7.30 గంటల వరకు అమ్మవారి తెప్పోత్సవం వేడుకగా సాగింది. విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన తెప్పపై అమ్మవారు కొలువై పుష్కరిణిలో ఏడు చుట్లు తిరిగి భక్తులకు కనువిందు చేశారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఆలపించిన భక్తి సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో పార్థసారథి,ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.